## ప్రసంగము 7

# దేవుడు మరియు విగ్రహారాధన

## (1 కొరింథీయులకు 10:14-22)

క్రైస్తవులకు గాని ఇతరులకు కాని ఏ ఆధ్యాత్మిక హాని చేయబడనంతవరకు వారు విగ్రహములకు అర్పింపబడిన మాంసమును తినవచ్చునని పౌలు అంతకు మునుపు కొరింథీలోని సహోదరులకు తెలియజెప్పాడు.[1] ఏదిఏమైనా, 10:14-22లో, క్రైస్తవులు దానిని దాటి అవతలకు వెళ్లకుండునట్లు అపొస్తలుడు ఒక ఎల్లను ఏర్పరచాడు. అన్యజనుల మతసంబంధమైన కార్యకలాపములలో వారు పాల్గొనరాదు (10:14-22).

ఇటువంటి సందేశము నేటి ప్రపంచానికి, యింకా విగ్రహారాధనలో మునిగియున్న లోకానికి, చాలా సందర్భయుక్తమైనదై యున్నది, అనేకులు దేవుళ్లను, ఆత్మలను, లేక బైబిలు యొక్క ప్రభువైన దేవుని తప్ప ఇతర శక్తులను పూజించుచున్నారు.

### విగ్రహారాధన సంబంధమైన బైబిలు బోధలు

విగ్రహారాధన పాత నిబంధనలోనైతేనేమి క్రొత్త నిబంధనలోనైతేనేమి ప్రబలముగా పేర్కొనబడిన ఒక ప్రధానాంశమై యున్నది. విగ్రహారాధన గూర్చి బైబిలు, నిర్దిష్టముగా, ఏమి తెలియజెప్పుచున్నది?

### దేవుడు విగ్రహారాధనను సహించడు

దేవుడు ఇశ్రాయేలీయులతో, "నీ దేవుడనైన యెహోవాను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తు దేశములో నుండి నిన్ను వెలుపలికి రప్పించితిని నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు" అని చెప్పాడు (నిర్గమకాండము 20:2, 3). ఇది దేవుడు వారికిచ్చిన పది ఆజ్ఞలలో మొట్టమొదటిదై యున్నది. వాగ్దానము చేయబడిన దేశములో వారు ప్రవేశింపబోవుచున్నారనగా దేవుడు మోషే ద్వారా, తన ప్రజలతో ఇట్లనెను,

> నీ దేవుడైన యెహోవాకు భయపడి ఆయనను సేవించి ఆయన పేరట ప్రమాణము చేయవలెను. మీరు ఇతర దేవతలను, అనగా మీ చుట్టునున్న జనముల దేవతలను సేవింపకూడదు. ఏలయనగా నీ మధ్యను నీ దేవుడైన యెహోవా రోషముగల దేవుడు; గనుక నీ దేవుడైన యెహోవా కోపాగ్ని ఒకవేళ నీమీద రగులుకొని దేశములోనుండకుండ నిన్ను నశింపజేయును (ద్వితీయోపదేశకాండము 6:13-15).[2]

విగ్రహారాధన నిషేధింపబడుటలో విగ్రహములను తయారుచేసికొని వాటిని పూజించుట వలదని వారించిన విషయములో ఇమిడి యుండెను. ఇది దేవుడిచ్చిన పది ఆజ్ఞలలో రెండవది (నిర్గమకాండము 20:4-6). ఇశ్రాయేలీయులు ఇతర దేవతల పేర్లనైనను ఎత్తకూడదు (నిర్గమకాండము 23:13). విగ్రహారాధనా నిషేధమునకు సంబంధించిన ఆజ్ఞకు దగ్గరగా మంత్ర విద్యలు మరియు ఇతర రకములైన కర్ణపిశాచములు వలదని వారిచ్చిన

అధికార శకునము ముడిపడి యుండినవి (లేవీయాకాండము 19:26బి, 31; 20:6; ద్వితీయోపదేశకాండము 18:9-14).[3]

విగ్రహారాధన చేయువారికి వారు చెల్లించవలసిన అపరాధ రుసుము - మరణం, వ్యక్తిగతముగానైనను (నిర్గమకాండము 22:20) మరియు దేశమంతటికైనను (ద్వితీయోపదేశకాండము 6:14, 15; 1 రాజులు 9:6-9 చూడుము). ఇశ్రాయేలీయులు ఇతర దేవతలను ఆరాధించుటకు శోధింపబడకుండునట్లుగా, వారు పాలు తేనెలు ప్రవహించు దేశమైన కనానును స్వాధీనం చేసికొన్న తరువాత ఇతర దేశములను నాశనము చేయవలెనని తెలుపబడ్డారు (నిర్గమకాండము 23:23, 24). వాస్తవమునకు, అట్టి ప్రజలు దేశములో నుండకుండా వారిని సంపూర్తిగా వెళ్లగొట్టుటలో వారు విఫలులైనందు వలననే, ఇశ్రాయేలీయులు విగ్రహారాధికులయ్యారు మరియు చివరకు వారి స్వదేశమే నాశనమయ్యింది (2 రాజులు 17:7-18). వారి పరిస్థితి ఒక రచయిత ఇలా చక్కగా వర్ణించాడు: "విగ్రహారాధనను విధ్వంసము చేయాలి లేదా విగ్రహారాధనచేత విధ్వంసము చేయబడాలి అనునదే లేఖనముల భావమై యుండినది."[4]

"దేవుడు ఒక్కడే" అని (ఎఫెస్సీయులకు 4:6) - "లోకమందు విగ్రహము వట్టిదనియు, ఒక్కడే తప్ప వేరొక దేవుడు లేడనియు" (1 కొరింథీయులుకు 8:4బి).[5] మనము క్రొత్త నిబంధనలో గుర్తుచేయబడుచున్నాము. ప్రజలు "వ్యర్థమైన వాటిని విడిచిపెట్టి, ఆకాశమును భూమిని సముద్రమును వాటిలో ఉండు సమస్తమును సృజించిన జీవముగల దేవుని వైపు మళ్లవలెనని" ప్రేరేపింపబడిన మొదటి శతాబ్దపు సువార్తికులు వారిని విజ్ఞాప్తి చేసారు (అపొస్తలుల కార్యములు 14:15; 17:22-31 చూడుము). అన్యజనులై యుండిన క్రైస్తవులు విగ్రహారాధనను మానివేసారు. ఉదాహరణకు థెస్సలొనీకయులు, "విగ్రహములను విడిచి పెట్టి. జీవముగలవాడును సత్యవంతుడునగు దేవుని వైపు మళ్లారు" (1 థెస్సలొనీకయులు 1:9బి; 1 కొరింథీయులకు 12:2 కూడ చూడుము). తత్ఫలితంగా, వారు విగ్రహారాధనతో యిక ఎటువంటి సంబంధమునైనను పెట్టుకొనకూడదనియు విగ్రహారాధనకు "దూరముగా పారిపోవలెననియు" గట్టిగా చెప్పబడిరి (1 కొరింథీయులకు 10:14; 1 యోహాను 5:21; 1 పేతురు 4:3 కుడా చుడుము).[6] మరియు దేవుని రాజ్యమునకు వారసులు కానివారిలో విగ్రహారాధికులుంటారని హెచ్చరింపబడిరి (1 కొరింథీయులకు 6:9; గలతీయులకు 5:19-21 చూడుము). అవినీతిపరులును పేరాశగలవారునైన సంఘ సభ్యులు మరియు దూషకులును, త్రాగుబోతులును, మరియు మోసగాళ్లునై యుండిన క్రైస్తవులతో కూడా (1 కొరింథీయులకు 5:11) సమానంగా విగ్రహారాధికులు సహితము సంఘ క్రమశిక్షణకు లోబడవలసినవారై యుండిరి విగ్రహారాధనను విడిచిపెట్టనివారి - వారు క్రైస్తవులని పిలువబడినను పిలువబడక పోయినను వారి - అంత్య గమ్యము, "అగ్ని గంధకములతో మండు గుండములో పాలుపొందుదురు; ఇది రెండవ మరణము" (ప్రకటన 21:8). దేవుని సేవించవలెననియు, ఆయనకు విధేయులై యుండ వలెననియు నిత్య రక్షణను పొందకొనవలెననియు ఆశించువారు బైబిలు బోధించు ఒకే దేవుని భూమ్యాకాశములను సృజించినవాని తప్ప ఏ దేవతనైనను అంగీకరించుటకు లేక ఆరాధించుటకు తృణికరించవలెను!

## దేవుని ఆరాధనకును విగ్రహారాధనకును పొత్తు కుదరదు

విగ్రహారాధనను అభ్యసించుట దేవుడైన యెహోవాను ఆరాధించుటతో పొసగదని బైబిలు బోధించుచున్నది. పౌలు, "మీరు ప్రభువు బల్లమీద ఉన్నదానిలోను దయ్యముల [విగ్రహముల] బల్లమీద ఉన్నదానిలోను కూడ పాలుపొందనేరరు" అని చెప్పినప్పుడు ఆయన చెప్పినది కూడ సరిగ్గా ఈ విషయమే (1 కొరింథీయులుకు 10:21బి). ఒకరు ఏదో ఒక ఇతర దేవతను పూజించుచునే నేను దేవుని వెంబడించుచున్నాను అని చెప్పుకొనుట ద్వారా దేవుని సంతోషపెట్ట లేదని ఆయన ఉద్దేశించాడు.[7]

ఈ అభిప్రాయము బైబిలు సంబంధమైన ఒక ప్రధానాంశమై యున్నది. దేవుడు రోషముగల దేవుడై యున్నాడు (ద్వితీయెపదేశకాండము 5:9ఎ); ఆయన తనతో పోటీపడువారెవరినైనను సహించలేడు. "నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు" (నిర్గమకాండము 20:3), అనగా, ఇతర దేవతలను పూజించుటకు మనము ఆయనను విడిచిపెట్టక యుండుట మాత్రమే కాదు గాని, ఆయనతో సహా మరొక దేవుడనిగాని దేవత యని గాని కలిగియుండ కూడదు మరియు వాటి పేరే ఎత్తకూడదనునది దాని అర్థమై యున్నది.

ఆయనతో సహా ఇతర దేవతలను ఆరాధించుట దేవుడు ఆమోదించడను వాస్తవము దేవుని ప్రజలు మర్చిపోవుటకు ఎల్లప్పుడు మొగ్గు చూపిరనుట ఒక సత్యమై యున్నది. పాత నిబంధన కాలములో, ఇశ్రాయేలీయులు దేవుని యందు వారికుండిన విశ్వాసమును ఒదిలిపెట్టి ఆయనకు బదులుగా ఇతర దేవతలను పూజింపలేకపోయారు. దానికి బదులుగా, దేవుడైన యెహోహా ఆరాధనకు ఇతర దేవతలను కలుపుటకు వారు ఉబలాటపడ్డారు. ఉదాహరణకు "యాజకులు బయలు దేవతకు [ఒక అబద్ధ దేవత] మరియు yahweh [దేవుడైన యెహోవాకు] బలుల నర్పించిరి మరియు దేవాలయములోనే విగ్రహముల ప్రతిమలునిలువబెట్టింపబడెను (2 దినవృత్తాంతములు 15:16; యిర్మీయా 32:34; యెహెజ్కేలు 8:5-11)."[8]

ఈనాడు, క్రైస్తవులు సహితము దేవుని బహిరంగముగా తిరస్కరించి వారి విశ్వాసపాత్రను ఇతర దేవతల వైపు మార్చుటకు అవకాశము లేదు; కానీ అనేకులు దేవుని ఆరాధించుటతో పాటు ఇతర దేవతలను కూడ సేవించుచున్నారు. క్రైస్తవులు ఆయన ఇచ్చిన ఆజ్ఞకు అవిధేయులగుచు దేవునితో పాటు సిరిని (ధనమును) కూడ పూజించుచున్నారు. ఆఫ్రికా ఖండములో అనేక సంవత్సరముల అనుభవముగల మిషనెరీయైన వెండెల్ బ్రూమ్ ప్రకారము, ఆఫ్రికా దేశములోని కొన్ని సంఘములలో సహితము ఒక సర్వసాధారణమైన సమస్య ఉన్నది. ఒక ముఖాముఖి సమావేశములో ఆయన ఇలా చెప్పాడు,

> ఆఫ్రికా దేశములో సంభవించినదేమనగా పాత దేవతలు భూగర్భములో కలిసిపోయాయి, అట్లయినను విశ్వాసులైన సంఘ సభ్యులు యిప్పటికిని, కొంచెము జలుబు చేసినా పెద్ద జబ్బు చేసినా లేక ఏదైన ఆపద సంభవించిన సమయములలో, వెంటనే పాత దేవతల వైపు పరుగులు తీస్తున్నారు. అనేక మంది క్రైస్తవులు గ్రామాల్లోగల "ప్రార్థన గృహములకు" (విగ్రహారాధికులు కూడుకొని పూజలు చేయు చోటికి) వెళ్లుచుందురు. అనేక మంది క్రైస్తవులు ఈ ప్రార్థన గృహముల సభ్యులుగా కూడ ఉంటూ ఈ గృహములలో బలులనర్పించుచున్నారు.[9]

హెన్రీ హఫ్ఫార్డ్, ఆఫ్రికా దేశములో సేవ చేసిన మరొక దీర్ఘకాలిక మిషనెరీ, ఈ క్రింది విధంగా చెప్పుచూ ఏకీభవించాడు,

> ఏదేన ఒక అరిష్టము అలుముకొన్నట్లయితే, క్రైస్తవుడు మౌలిక ఆధారాలన్నిటిని మరుగున పెట్టునట్లు శోధింపబడుచున్నాడు. దేవునికి చేయుచున్న ప్రార్థన ఆశించిన ఫలితమును తెచ్చుచున్నట్లు అగుపించకపోయినట్లయితే, అతడు ఒక షమాన్ (జు – జు పూజారి, లేదా మరొక పేరేదైనను ఉండవచ్చు) యొద్దకు వెళ్లవచ్చును లేదా ఒక "ప్రార్థన గృహమునకు" వెళ్లి అతనిని ఎవరు శపించిరో కనుగొని, ఆ శాపమును తొలిగించుకొనుట కొరకు మంత్రములను వల్లించుచు, లేదా ఏదో ఒక విధంగా ఆత్మలతో కలిసికొనగలుగునట్లు బలులను అర్పించు ప్రక్రియను ప్రారంభించవచ్చును. ఈ విధమైన మార్గములను అవలంబించుట తప్పని చర్చ్ ఆఫ్ క్రైస్ట్ సంఘ సభ్యులకు తెలియును, కానీ వారు సాంప్రదాయికమైన సంవిధానములను అనుసరించవలెనని తరుచుగా కుంటుంబ సభ్యులు లేదా అత్తమామలు బహుగా ఒత్తిడి చేయుదురు. భయము తన పాత్రను నిర్వహించుచున్నదని మనము అరుదుగా గ్రహించగలము ... ఒక వైపు యెహోవాను సేవించుచునే మరొక వైపు ఇశ్రాయేలీయులు చేసినట్లే చేయవలెననియు ఆ యా ప్రాంతములలోని ఆత్మలను ఆరాధించవలసినదేననియు ఒక గొప్ప శోధన, మరి ముఖ్యముగా గ్రామీణ ప్రాంతాల్లో, ఎదురౌతున్నది. ఆత్మలను శాంతింపజేయుటకు క్రైస్తవులు రహస్యంగా పిరికిపందలవలె ప్రార్థన గృహములకు లేదా సాంప్రదాయికమైన స్థలాలకు వెళ్లుదురు.[10]

దేవుడు పాక్షికమైన భక్తిశ్రద్ధలను అంగీకరించడు. అయన రోషముగల దేవుడై యున్నాడు మరియు తన భక్తులను ఆయన మరొక దేవతతో పంచుకొనడు. ఆయన ప్రజలు వారు కలిగియున్న సమస్త ఉనికితో ఆయనను సేవించవలెను, దేవుని మాటలను ఇశ్రాయేలీయులకు తెలియజేయుచుండిన మోషే, "ఇశ్రాయేలూ, వినుము! మన దేవుడైన యెహోవా, అద్వితీయుడగు యెహోవా! నీవు నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ శక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను" అని చెప్పాడు (ద్వితీయోపదేశకాండము 6:4, 5; నొక్కి చెప్పింది నాది).[11] అన్యజనుల మతపరమైన అలవాట్లను అభ్యసించు క్రైస్తవులు వారు పాటించుచున్న అభ్యాసములు క్రైస్తవ్యముతో పొసగవని గ్రహించవలసి యున్నది! క్రైస్తవుడై యుండ గోరువాడెవడైనను వాడు పూర్వము విగ్రహారాధనా అలవాట్లతో కలిగియుండిన సంబంధములను సంపూర్తిగా త్యజించవలెను.

## విగ్రహాలకును దేవునికిని పొత్తు కుదురదు

విగ్రహములు దేవునితో పోల్చబడజాలవని పరిశుద్ధ బైబిలు బోధించుచున్నది. విగ్రహాలు ఆరాధింపబడుటకు అర్హమైనవి కావని ఇశ్రాయేలీయుల ప్రవక్తలు నిరూపించారు. అదే విధంగా, విగ్రహములు నిజముగా "వట్టివే" అని పౌలు చెప్పాడు (1 కొరింథీయులకు 10:19): వాటికి నిజమైన ఉనికిగాని వాటిలో నిజమైన జీవముగాని లేదు; అవి శక్తిహీనమైనవి.

నిజమైన దేవునికిని విగ్రహములకును మధ్య గల తారతమ్యము కర్మెలు పర్వతముపై ఏలీయాకు మరియు బయలు దేవత ప్రవక్తలు మధ్య జరిగిన పోటి ద్వారా స్పష్టమైన ఉదాహరణముగా వర్ణింపబడినది. బయలు దేవత ప్రవక్తలు వారి దేవతను గంటల తరబడి, బిగ్గరగా కేకలు వేయుచూ, బలిపీఠము చుట్టూర గంతులు వేయుచూ, వారి దేవత యొక్క దృష్టిని ఆకర్షించుటకు తమ్మునుతాము రక్తము కారునట్లు కోసికొనుచు పిలిచారు – కానీ ఎటువంటి ప్రతిస్పందన రాలేదు. "... ఒక మాటయైనను ప్రత్యుత్తరమిచ్చువాడెవడును లేకపోయెను" (1 రాజులు 18:26–29). దీనికి భిన్నముగా, ఏలీయా చేసిన ప్రార్థన, ఒక్కసారి

మాత్రమే చేయబడినది, దేవుడు ఎంతో శక్తివంతమైన రీతిలో సమాధానమిచ్చాడు (1 రాజులు 18:36-38). బయలుదేవత యొక్క బలహీనత సజీవుడైయున్న దేవుని సర్వశక్తిమంతము ఎంత చక్కగా ప్రదర్శింపబడినవి కదా! అప్పుడు ప్రజలందరు, "యెహోవాయే, దేవుడు; యెహోవాయే దేవుడు" అని బిగ్గరగా కేకలు వేసారు (1 రాజులు 18:39). దేవుడు సజీవుడై యున్నాడు; ఆయన వినగలడు, ఆయన శక్తిమంతుడైయున్నాడు. అబద్ధ దేవతలు వినలేవు లేదా జవాబియ్యలేవు ఎందుకనగా వాటికి శక్తి లేదు; వాటికి నిజమైన ఉనికి లేదు.

బైబిలు సంబంధమైన గ్రంథకర్తలు ఈ తుది అభిప్రాయముతో ఏకీభవించారు. విగ్రహములకు "ప్రాణమేమియు లేదు. అవి ... మాయాకార్యములు ... అవి నశించిపోవును" (యిర్మీయా 51:17, 18; 10:14, 15 చూడుము); అవి "చచ్చిపోయినవి" (కీర్తనలు 106:28); అవి వాటి స్వంత ప్రజలను విడిపింపలేవు (2 దినవృత్తాంతములు 25:15; యిర్మీయా 11:12బి కూడ చూడుము); అవి మాటలాడలేవు, చూడలేవు, వాసనచూడలేవు, తాక లేవు, నడువలేవు, లేదా శబ్దము చేయలేవు (కీర్తనలు 115:4-8). వాస్తవమునకు, అవి హానిచేయలేవు సరికదా మేలైనను చేయలేవు (యిర్మీయా 10:5).

ఆయనే మానవునితో సహా, సమస్తమును సృజించెననునదియు (అదికాండము 1), విగ్రహములు దేవుడు సృజించిన మానవుని చేత చేయబడినవనునదియు దేవునికిని విగ్రహములకును మధ్య గల ఒక గొప్ప తారతమ్యమై యున్నది. చేతిపనిలో నైపుణ్యముగలవారు విగ్రహములను తయారు చేయునప్పుడు చేసే పనులను సవివరంగా వర్ణించుచు, ఈ భేదమును యెషయా నొక్కి వక్కాణించాడు. అటుతరువాత, వ్యంగ్యముగా, విగ్రహమును తన చేతితో చేసికొన్న మానవుడే దానికి వంగి నమస్కరించుచున్నాడు! (యెషయా 44:9-20; 40:19, 20; యిర్మీయా 10:1-16; హబక్కూకు 2:18-20 కూడ చూడుము.)

విగ్రహమును పూజించుట అదొక తప్పు మాత్రమే కాదు, కానీ అదొక మూర్ఖపు పని కూడ అయి యున్నది. కర్రతో లేక రాతితో చేయబడిన విగ్రహముల యెదుట వంగి నమస్కరించువారు లేదా ఆత్మలు లేక పూర్వీకుల సహాయము వెదకువారు సవాలు చేయబడవలెను. "నీ దేవత నీకు సహాయము చేయగలదని నీవు నిజముగా అనుకొనుచున్నావా? నీ దేవత నిన్ను నిజముగా బాగుచేయగలదా? అది, వాస్తవమునకు, ఏపనైనా చేయగలదా?" అని మనము వారిని అడుగవచ్చును. భూమ్యాకాశములను సృజించిన దేవుడు, నిత్యమూ జీవించియున్న దేవుడు సమస్త మానవాళికి సహాయము చేయగల దేవుని గూర్చి వారు తెలిసికొనవలసిన అవసరం ఎంతో ఉన్నది.

ఈ అంశము గూర్చి బైబిలు బోధించుచున్న ప్రబోధముల దృష్ట్యా, విగ్రహారాధనకు క్రైస్తవులు ఎలా ప్రతిస్పందించాలి? విగ్రహారాధనకు క్రీస్తు వ్యతిరేకమైనవాడు గనుక క్రైస్తవులు కూడా దానికి వ్యతిరేకులై యుండవలెను. ప్రవక్తలవలె, క్రైస్తవులు విగ్రహారాధనతో యుద్ధము చేయుటకు సన్నద్ధులై యుండవలెను. విగ్రహారాధనా ప్రవర్తనలను సహించుటకు బదులుగా, నీతిమంతమైన ప్రవర్తనా నియమావళి హద్దులలో, విగ్రహారాధనా ప్రభావమును సమూలంగా నిర్మూలించుటకు - మరి ముఖ్యముగా సంఘములోగల దానిని నిర్మూలించుటకు - మనము చేయగలిగిన దానంతటినీ చేయవలెను.[12] ప్రాచీన కాలములో, దేవుని ప్రజలు నాశనమయ్యింది ఈ విగ్రహారాధననుబట్టియే, ఈనాడు విగ్రహారాధనకు సంఘము కనుపర్చు ప్రతిస్పందన సంఘము సజీవంగా నిలిచియుంటుందా లేక మృతమైపోతుందా అను సత్యమును

నిర్ధారించును. బ్రూమ్ ప్రకారం, "పాత నిబంధన దేవుని ప్రజలకు విగ్రహారాధన ప్రాణాంతకమైన సమస్యయై యుండినది గనుక ఇప్పుడది ఆఫ్రికా సంఘములకు సహితము ప్రాణాంతకమైనదై యుండగలదు."[13]

## విగ్రహాముల నుండి నిజమైన దేవుని వైపు తిరుగుట

క్రీస్తు ఇచ్చుచున్న ఆహ్వానము ఇతర దేవతలను ఆరాధించుచు వారి జీవితములను గడిపిన వారికి కూడ అందునట్లు పొడిగింపబడుచున్నది. మొదటి శతాబ్దములో థెస్సలోనీకయులు విగ్రహములను వదిలిపెట్టి దేవుని వైపు మళ్లినట్లే, ప్రతి యుగములోను విగ్రహారాధికులు దేవుని వైపు తిరిగిన సందర్భాలున్నాయి (1 థెస్సలొనీకయులు 1:9–10). విగ్రహారాధికులు క్రీస్తు యొద్దకు ఎందుకు రావాలి?

### దేవుని స్వభావము

అబద్ధపు దేవతల నుండి నిజమైన దేవుని వైపునకు మళ్లవలెనని చెప్పుటకు గల హేతువొకటి దేవుని స్వభావములో చూడనగును, క్రైస్తవులు ఆరాధించు దేవుడు విగ్రహారాధికులు పూజించు దేవతల కంటె మిక్కిలి మిన్నయైనవాడై యున్నాడు. ఈ దేవతలు, నిలకడలేకుండా నమ్మశక్యము కానివనియు ఆధార రహితమైనవనియు చక్కగా వర్ణించబడ్డాయి. ఇక వాటి గూర్చిన చెడు విషయం గూర్చి చెప్పుకుంటె, వాటి చర్యలు మానవాళి పట్ల ద్రోహబుద్ధిగలవియు ఉద్దేశపూర్వకంగా హానికరములై యున్నవని చిత్రీకరింపబడినవి. అవి మానవులకు చేయు చెడు ప్రత్యేక అర్పణలు మరియు ఉత్సవములచేత చెదరగొట్టబడుతుంది. సత్యము చెప్పాలంటె, వాటికి ఎటువంటి శక్తియైనను లేదు. వాటిని నమ్ముకొనువారికి అవి సహాయం చేయలేవు మరియు హాని కూడ చేయలేవు.

తారతమ్యమును పరిశీలనగా చూచుచు, మనము దేవుని స్వభావము గూర్చి యోచించుదము:

- *ఆయన నిత్యుడు మరియు ఎన్నటికినీ మారనివాడు* (కీర్తనలు 102:25–27). ఆయన నిలకడగా నుండి ఆధారసహితుడై యున్నాడు. "దేవుడు నమ్మదగినవాడు" (1 కొరింథీయులకు 10:13).
- *ఆయన సర్వశక్తిమంతుడు* (యిర్మీయా 32:17; ఎఫెసీయులకు 3:20). లోకమును లోకములో ఉన్న దానంతటిని సృజించినవాడు ఆయనే (అపొస్తలుల కార్యములు 14:15).
- *ఆయన ఉపకారబుద్ధిగలవాడు.* అది మనకెలా తెలియును? పరిశుద్ధ సత్యవేదమైన బైబిలు చెప్పుచున్నది గనుక మనకు తెలియును. "దేవుడు ప్రేమయై యున్నాడు" (1 యోహాను 4:8). నిజమైన దేవుని ఉపకార స్వభావము గూర్చి లోకమే సాక్ష్యమిచ్చుచున్నది (అపొస్తలుల కార్యములు 14:17).
- *ఆయన ఎల్లప్పుడును అందుబాటులో ఉన్నాడు* (అపొస్తలుల కార్యములు 17:26–28). మనము దేవునిని ఆయన నిర్దేశనముల ప్రకారము సమీపించినట్లయితే, ఫలితమేమైయుండునోయని మనమెన్నడునూ ఆశ్చర్యపడనవసరము లేదు.

దేవుడున్నాడు, ఆయన వినగలడు, మరియు ఆయన తన వాక్యము మరియు చిత్తానుసారముగా కార్యములు జరిగించును. మన యెడల ఆయన చేయు కార్యములు ఎల్లప్పుడు ఆయన ప్రేమపైనే ఆధారపడి యున్నవి.

## క్రీస్తు యొక్క స్వరూపము

విగ్రహారాధనను విడిచిపెట్టి దేవుని వైపు తిరుగవలెననుటకు గల మరొక కారణము యేసు క్రీస్తు యొక్క స్వరూపములో చూడనగును. సృష్టికర్తయైన దేవుని గూర్చి క్రైస్తవులకు తెలియును ఎందుకనగా ఆయన తన కుమారుని ఈ లోకమునకు పంపుట ద్వారా తననుతానే బయలుపర్చుకొన్నాడు. యేసు శరీరధారియైన దేవుడుగా ఇహమునకేతెంచాడు (యోహాను 1:1, 14; 14:9; మత్తయి 1:23 చూడుము). ఆయన పాపరహితమైన జీవితము జీవించాడు మరియు ఆయన చేసిన అద్భుతముల ద్వారా తన శక్తిని ప్రత్యక్షముగా కనుపర్చాడు. ఆయన బోధించుచు కనుపర్చిన తన వివేకము మరియు తెలివి ద్వారా తండ్రిని ప్రతిబింబించాడు, మరియు ప్రతి ఒక్కరికిని ఆయన ప్రేమను దయను మరియు జాలిని ప్రదర్శించాడు. మానవులందరు రక్షింపబడునట్లు ఆయన శ్రమనొందుటకు, సిలువపై మరణించుటకైనను సంసిద్ధుడై యుండెను. ఆయన పునరుత్థానము ఆయన యొక్క దైవత్వమునకు నిదర్శనమై యున్నది; మరియు ఆయన మరలా వచ్చుననియు, వచ్చినప్పుడు లోకమునకు తీర్పు తీర్చుననియు వాగ్దానము చేసాడు. ఇతర మతసంబంధమైన ఏ పద్ధతియందును యేసునకు, మానవాళి రక్షకుని వలె కొంచెమైనను లేదు. గనుక ఖచ్చితంగా, ప్రతి ఒక్కరును ఇటువంటి వ్యక్తినే వెంబడించవలెనని ఆశించుదురు!

## క్రైస్తవ్యములో గల దీవెనలు

విగ్రహారాధనా దేవతలను పూర్తిగా వదిలిపెట్టి యేసును ప్రకటించు సువార్తల సందేశమునకు విధేయులు కావలెననుటకు గల మూడవ కారణము క్రైస్తవుడై యుండుటలో గల దీవెనలకు సంబంధించినదై యున్నది.

*పరిశుద్ధత అనుగ్రహింపబడును.* క్రైస్తవులముగా మనము దీవింపబడినవారమై యున్నాము ఎందుకనగా మనము పరిశుద్ధ జీవితము జీవించవలెనని క్రీస్తు పిలుపునిచ్చుచున్నాడు. క్రైస్తవుడైనవాడు మునుపటి అవినీతికరమైన జీవితమును కొనసాగించలేడు. ఆయన పరిశుద్ధుడై యున్నట్లుగానే, ఆయన ప్రజలు కూడ పరిశుద్ధులై యుండవలెనని దేవుడు కోరుచున్నాడు (1 పేతురు 1:15). క్రైస్తవుడైనవాడు సరిక్రొత్తగా జన్మించినవాడై (యోహాను 3:3, 5; 1 పేతురు 1:22, 23) నూతన జీవితమును అనుభవించును (రోమీయులకు 6:3, 4). వాడు పాపమును ప్రాచీన పురుషుని పరిత్యజించి పవిత్రముగా నడుచుకొనుటకు ప్రారంభిస్తాడు (రోమీయులకు 6:11-13). పాత విధానములు ఎట్టి విధముగానైనను సరిపడవు.

పరిశుద్ధత కొరకైన ఈ పిలుపు విగ్రహారాధనా సంబంధమైన మతములకు తెలియదు. అబద్ధ దేవతలు మరియు ఆత్మలే నీతియుక్తమైనవిగా గోచరించవు, సరికదా వాటికి నీతియుక్తమైన ప్రవర్తన అవసరంలేదు. వాస్తవమునకు, సృష్టికర్తను తృణీకరించి ప్రాణిని ఆరాధించుటను ఆరంభించుటవలన కలుగు పాపిష్టి పరిస్థితి అంతకంతకు అధికమగుచుండును

(రోమీయులకు 1:18-32). క్రైస్తవులు ఉన్నతమైన ప్రమాణములతో కూడిన జీవితము జీవించుచుండవలెనని కోరబడుదురు, గనుక క్రైస్తవ్యం ఒకరి అనుదిన జీవితముపై - వారి వ్యక్తిగత సంతోషమును సంతృప్తిని హెచ్చించుటకు బదులుగా, తగ్గించు అదనపు భారమును పెట్టునని కొందరనుకొనవచ్చును, కానీ దీనికి విరుద్ధంగా, పాపిష్టిగా జీవించుట వలన దుఃఖముతో కూడిన దుర్దశను మరియు మరణమునే కలుగజేయునని వేలాది మంది ప్రజల అనుభవములు ప్రదర్శించుచున్నవి (రోమీయులకు 6:23), ఇది ఇలా ఉండగా పవిత్రమైన జీవితము అన్నిటిని మించిన సంతోషభరితమును, సమృద్ధియునైన జీవితమైయున్నది[14] (యోహాను 10:10). నీతియుక్తముగా జీవించవలెనని వెదకుచుండు క్రైస్తవుడు నిజముగా "ఎల్లప్పుడు సంతోషముగా" జీవించును (1 థెస్సలొనీకయులకు 5:16).

*భయము తరిమివేయబడును.* క్రైస్తవులు ధన్యులై యున్నారు ఎందుకనగా మన జీవితములలో నుండు భయమును క్రీస్తు తరిమివేయును (యోహాను 14:27; 1 యోహాను 4:18). మనము అబద్ధ దేవతలకు భయపడాల్సిన అవసరమే లేదు, ఎంచేతనంటే అటువంటివాటికి ఎటువంటి ఉనికియైనను లేదని మనకు తెలియును, మరియు ఉన్నది లేక ఉనికి కలిగియున్నది అని ఒకరనుకొను ఆత్మ కంటె క్రీస్తే అధిక శక్తిమంతుడై యున్నాడు. మనము నరమాత్రునికి గాని (హెబ్రీయులకు 13:6), లోకములో ఉన్న మరి దేనికైనను భయపడాల్సిన పని లేదు (రోమీయులకు 8:35-39), మరియు మనకు మరణ భయము లేదు (ఫిలిప్పీయులకు 1:21; 1 కొరింథీయులకు 15:54-57). వాస్తవమునకు, మనము "దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుకొనినట్లయితే" దేనికిని భయపడాల్సిన పని లేదు (ప్రసంగి 12:13).

*క్షమాపణ పొందుకొందుము.* మనము క్రైస్తవులమైనప్పుడు ధన్యులమౌదుము ఎందుకనగా మన పాపములు క్షమింపబడినవి. మనము యేసుతో కూడ ఎప్పటికీ ఉండునట్లు ఇంటికి, తండ్రి ఇంటికి వెళ్లుటకు ఎదురుచూడగలము. ప్రతి ఒక్కరు ఒక పాపియే; ఎప్పుడూ కాదనుకున్నా లేదనుకున్నా అప్పుడప్పుడైనా మనము పొరపాట్లు చేస్తూనే ఉంటాము. ఒకానొక దినాన యేసు తిరిగి వచ్చినప్పుడు దేవుడు మనకనుగ్రహించిన రక్తమాంసములు గల శరీరముతో ఏమేమి చేసామో వాటి గూర్చి మనలనందరినీ లెక్కలు ఒప్పజెప్పమంటాడు. మన పాపములు క్షమించబడితే తప్ప, మనకు నరకమే ప్రాప్తమౌతుంది. ఏదిఏమైనా, తీర్పు దినాన మనము మన పాపములనుట్టి నరక శిక్షకు పాత్రులము కాకుండునట్లు మన పాపములు క్షమింపబడి, యేసు రక్తములో కడుగబడును.

ఇదెలా సాధ్యమగును? దేవుని కృప ద్వారా (ఎఫెస్సీయులకు 2:8, 9) మరియు యేసు క్రీస్తు చిందించిన రక్తము యొక్క బలము చేత (ఎఫెస్సీయులకు 1:7) అది సాధ్యమగును. ఆయన దేవుని కుమారుడని మనము క్రీస్తునందు నమ్మకముంచుచు (యోహాను 8:24); మన పాపముల గూర్చి పశ్చాత్తాపముతో మారుమనస్సు నొందుచు (లూకా 13:3; అపొస్తలుల కార్యములు 17:30); మన విశ్వాసమును ఒప్పుకొనుచు (రోమీయులకు 10:10; మత్తయి 10:32); మరియు మన పాపముల క్షమాపణ నిమిత్తమై క్రీస్తులోనికి బాప్తిస్మము పొంది (అపొస్తలుల కార్యములు 2:38; 22:16) క్రీస్తు వైపు విశ్వాసముతోను విధేయతతోను మళ్ళినప్పుడు అది సంభవించును.

ప్రియ చదువరీ, నీవు పైన చెప్పబడిన పని చేసినప్పుడు నీ పాపములు క్షమింపబడును,

అప్పుడు నీవు క్రైస్తవ జీవితము జీవించుటకు నీకొక మహాదవకాశము లభించును, విశ్వసనీయమైనవాడవుగా ఉండుటకు నీవు ప్రయత్నించినంత కాలము, యేసు రక్తము నిన్ను నీ పాపములను కడుగుచుండును (1 యోహాను 1:7). నీవు నిర్భయముగాను నిశ్చయమైన పరలోక నిరీక్షణతోను జీవించవచ్చును! విగ్రహములు అవి ప్రతిమలైనను, అత్మలైనను లేదా పూర్వీకులైనను – ఈ హక్కును సంపాదించుకొనలేవు!

## ముగింపు

కర్రతోగాని రాతితోగాని చేసిన విగ్రహములను పూజించము లేక మన పూర్వీకులను ఆదరాభిమానములతో ఆరాధించము లేదా ఆత్మలకు బలులర్పించము, గనుక మనము విగ్రహారాధన విషయములలో దోషులమై యుండలేమని మనమనుకొనవచ్చును. ఏది ఏమైనా, దేవుని కంటె మనము ఇతరమైన దేనికైనను ప్రాధాన్యత నిచ్చినప్పుడు అది మనకొక విగ్రహమౌతుంది.

---

సూచనలు

[1]క్రైస్తవులు విగ్రహాలకు అర్పింపబడిన మాంసము తినుటకు వారిని అనుమతించిన సూత్రము, మతపరమైన పూజాపునస్కారాలు ఎవరికైనను వారు క్రైస్తవులైనను క్రైస్తవేతరులైనను – ఆధ్యాత్మికముగా హానిచేయనంత వరకు విగ్రహారాధనతో సంబంధము కలిగియుండగల కార్యకలాపములలో పాల్గొనుటకు మనలను కూడ అనుమతించుచున్నది. వాటి నామధేయములలో అనేక అన్యజనుల దేవుళ్ల పేర్లనుబట్టి పెట్టబడినప్పటికిని, మాసములు మరియు వారములోని దినములను వాటి సామాన్య పేర్లతో పిలుచుకొనుటకు ఈ సూత్రము క్రైస్తవులకు అనుమతి నిచ్చుచున్నది. అంతమాత్రమేగాక, మొదట్లో విగ్రహారాధనకు సంబంధించిన విశ్వాసములో వేరుపారినవై యుండినవే కానీ ఇతర దేవుళ్లతోను ఆత్మలతోను కలిగియుండిన సంబంధము ఎప్పుడో మర్చిపోబడిన అనేక సామాన్య వాడుకలను (సెలవు దినములను సంబరముగా గడుపుట) క్రైస్తవులు వినియోగించుకొనునట్లు అది వారిని అనుమతించుచున్నది. [2]ఈ వాక్యభాగమును యేసు మత్తయి 4:10లో ఒక ఉల్లేఖనముగా చెప్పాడు (నిర్గమకాండము 23:24 కూడ చూడుము). విగ్రహములను తయారు చేసికొనుట లేక వాటికి పూజించుటకు నిషేధించిన బైబిలులోని యితర శాసనముల కొరకు నిర్గమకాండము 34:17; లేవీయకాండము 19:4; 26:1; ద్వితీయోపదేశకాండము 4:15–19, 25, 26; 11:16, 17, 28; 16:21, 22; 27:15; 30:17, 18 చూడుము. [3]మంత్రవిద్య నభ్యసించినవారు లేక అబద్ధ ప్రవచనములు పలికినవారు మరణమునకు గురయ్యారు (నిర్గమకాండము 22:18; లేవీయకాండము 20:27; ద్వితీయోపదేశకాండము 13:15). [4]Robert D. Spender, "Idol, Idolatry," in *Baker's Theological Dictionary of the Bible,* ed. Walter A. Elwell (Grand Rapids, Mich.: Baker Books, 2000), 364. [5]పౌలు యింకా ఈ విధంగా వివరిస్తున్నాడు, "దేవతలనబడినవారును ప్రభువులనబడినవారును అనేకులున్నారు. ఆకాశమందైనను భూమి మీదనైనను దేవతలనబడినవి యున్నను, మనకు ఒక్కడే దేవుడున్నాడు" (1 కొరింథీయులుకు 8:5, 6ఎ). "విగ్రహము వట్టిదే" అని చెప్పుటలో, విగ్రహములకు జీవమున్న ఉనికి లేదని ఆయన భావించాడని స్పష్టముగా తెలియుచున్నది. అవి దేవుడు సజీవుడైయున్నట్లుగా లేవు. [6]దేవుని మాత్రమే ఆరాధించవలెనని యేసు బలముగా ఆమోదించిన వివరము కొరకు మత్తయి 4:10 కూడ చూడుము. [7]"మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు" అని యేసు చేసిన ప్రకటనను పోల్చి చూడుము (మత్తయి 6:24). [8]Spender, 364. దేవాలయములో నిర్మింపబడిన అబద్ధ దేవతల బలిపీఠములకు సంబంధించినంత వరకు, 2 రాజులు 21:3–5 కూడ చూడుము. ఇశ్రాయేలీయులు విగ్రహారాధనా అలవాట్లు, దేవుని ఆడంబరముగా సేవించుచు ఆరాధించుచుండినప్పుడు అభ్యసించినవి, అనేక వాక్యభాగములలో సూచింపబడినవి. (ఉదా॥ యెషయా 57:6; 65:11; యిర్మీయా 7:17, 18; 19:13; 32:29; 44:17, 19, 25; యెహెజ్కేలు 20:28–31 చూడుము.) [9]Broom. క్రైస్తవ్యమే నిజమైన మతమని వారు విశ్వసించుచున్నారని కొందరు క్రైస్తవులు స్వాధికారముతో చెప్పుదురు – కానీ, ఒక వేళ పితరుల దేవతలుగాని ఆత్మలుగాని నిజమైన శక్తిని కలిగియున్నట్లయితే, వారు వాటిని కూడా దేవునిగా గౌరవించుటకు కొనసాగించుదురు. [10]Henry Huffard, personal e-mail to Coy Roper, 6 March 2006.

[11]మత్తయి 6:24; 12:30; 22:37 పోల్చి చూడుము. [12]"కర్మెలు పర్వతముపై ఏలీయా పోరాడినట్లుగా వారు విగ్రహములకు విరోధముగా పోరాడుచుండిరి గనుక, ఎక్కువగా పాత నిబందన ప్రవక్తల గ్రంథములలో నుండి నేర్పించుట సంఘములో గల

విగ్రహారాధన సమస్యకు ఒక పరిష్కారము. దేవుని ప్రవక్తలు విగ్రహములను సహించలేకపోయారు” అని శ్రీ బ్రూమ్‌గారు చెప్పారు. (Broom.) [13]Ibid. [14]ఉదాహరణకు ఒకరు ఎప్పుడైనను వ్యభిచరించకుండా తనను తాను సంపూర్తిగా తన భర్తకు లేక తన భార్యకు అంకితమై అర్పించుకొనుట, అవినీతికరమైన జీవనశైలి కంటె అధికముగా సఫలీకృతమును సమకూర్చునదై యుండును.